# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 02-09-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ఇంధన భద్రత.. జాతీయ భద్రతలో అంతర్భాగమని కేంద్రమంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు.

- విమానయాన రంగంలో వ్యాపార సౌలభ్యాన్ని మెరుగుపరిచేందుకు ఎన్ఓసీ సర్టిఫికెట్ల జారీ ప్రక్రియను సరళీకృతం చేయాలని కేంద్రమంత్రి కె. రామ్మోహన్ నాయుడు అధికారులను ఆదేశించారు.

- భారత్.. ప్రస్తుతం 7 నుంచి 8 శాతం వృద్ధి రేటు కంటే వేగంగా అభివృద్ధి చెందే సామర్థ్యాన్ని కలిగి ఉందని వరల్డ్ బ్యాంక్ అధ్యక్షుడు అజయ్ బంగా అభిప్రాయపడ్డారు.

- ఉపహిమాలయ పశ్చిమ బెంగాల్, సిక్కింలలో రేపు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) అంచనా వేసింది.

============================

ఇంధన భద్రత, జాతీయ భద్రత, ఆర్థిక స్థితిస్థాపకతతో విడదీయరాని విధంగా ముడిపడి ఉందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. న్యూఢిల్లీలో పీహెచ్‌డీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ నిర్వహించిన 6వ `అంతర్జాతీయ వాతావరణ సదస్సు-2026`లో ఆయన ఈరోజు పాల్గొని ప్రసంగించారు. భారత్ మరింత స్వయం సమృద్ధి, అందుబాటు ధరలు, అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఇంధన రంగాన్ని అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. సురక్షితమైన, సుస్థిరమైన ఇంధన భవిష్యత్ దిశగా, ముఖ్యంగా స్వచ్ఛ ఇంధనాల వైపు భారత్ పరివర్తన దశలో ఉందని తెలిపారు. ప్రపంచ స్థాయిలో భారతదేశం మరింత కీలక పాత్ర పోషించాలంటే... ఇంధన రంగంలో చోటు చేసుకుంటున్న అంతర్జాతీయ ధోరణులు, సాంకేతిక పరిణామాలకు అనుగుణంగా ముందుకు సాగాల్సి ఉంటుందని జితేంద్ర సింగ్ అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విమానయాన రంగంలో వ్యాపార సౌలభ్యంపై పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు న్యూఢిల్లీలో ఈరోజు సమీక్ష నిర్వహించారు. విమానయాన రంగంలో వ్యాపార సౌలభ్యాన్ని మెరుగుపరిచే చర్యలతో పాటూ నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ల (ఎన్‌ఓసీ) జారీ ప్రక్రియను సరళీకృతం చేసే అంశంపై ఆయన సమీక్షించారు. ఎన్‌ఓసీ జారీ ప్రక్రియను ఇబ్బందులు లేని విధంగా, పారదర్శకంగా, నిర్ణీత కాలవ్యవధిలో పూర్తయ్యేలా మార్చాలని అధికారులను ఆదేశించారు. ఇందులో మాన్యువల్ జోక్యాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించాలని సూచించారు. ఎన్‌ఓసీ ప్రక్రియను సరళీకృతం చేయడం కోసం అవసరమైన విధి విధానాలను పరిశీలించి... 15 రోజుల్లోగా వాటి అమలుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కొత్తగా ఎన్నికైన రాష్ట్ర బార్ కౌన్సిళ్లు.. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) ఏర్పాటు కోసం చట్టపరమైన ప్రక్రియను పూర్తి చేసిన తర్వాతే బీసీఐ పునర్వ్యవస్థీకరణ అంశాన్ని పరిశీలిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. బీసీఐ చైర్‌పర్సన్ పదవిలో సీనియర్ న్యాయవాది మానన్ కుమార్ మిశ్రా కొనసాగడాన్ని, ఆయన పదవీకాలాన్ని 2030 వరకు పొడిగించినట్లు వచ్చిన అంశాన్ని సవాలు చేస్తూ.. దాఖలైన పిటిషన్లపై అత్యున్నత న్యాయస్థానం ఈరోజు విచారణ చేపట్టింది. అన్ని రాష్ట్ర బార్ కౌన్సిళ్లకు ఎన్నికలు పూర్తై, అవి తమ ప్రతినిధులను బీసీఐకి ఎన్నుకున్న తర్వాతే మానన్ కుమార్ మిశ్రా చైర్‌పర్సన్‌గా కొనసాగడంపై, అలాగే బీసీఐని పునర్వ్యవస్థీకరించాల్సిన అవసరం ఉందా లేదా అనే అంశంపై నిర్ణయం తీసుకుంటామని కోర్టు స్పష్టం చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం.. రాష్ట్ర బార్ కౌన్సిళ్లలో మహిళా సభ్యుల కో-ఆప్షన్ ప్రక్రియను రెండు వారాల్లో పూర్తి చేయాలని సంబంధిత హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులను ఆదేశించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్... ప్రస్తుతం 7 నుంచి 8 శాతం వృద్ధి రేటు కంటే వేగంగా అభివృద్ధి చెందే సామర్థ్యాన్ని కలిగి ఉందని వరల్డ్ బ్యాంక్ అధ్యక్షుడు అజయ్ బంగా అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఇంధన ధరల ఒత్తిళ్లు, వాణిజ్య అనిశ్చితి, ఎల్‌నినో ప్రభావం ఉన్నప్పటికీ.. భారత ఆర్థిక వ్యవస్థ పనితీరు పటిష్ఠంగా ఉందని ఆయన పేర్కొన్నారు. అమెరికాలోని యాష్‌విల్లేలో జరుగుతున్న జీ-20 ఆర్థిక మంత్రులు, కేంద్ర బ్యాంకుల గవర్నర్ల సమావేశం సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తో ఆయన ఈరోజు సమావేశమయ్యారు. భారత్ - వరల్డ్ బ్యాంక్ గ్రూప్ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే అంశాలపై ఇరువురు చర్చించారు. భారత్‌లో గ్లోబల్ డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నాలెడ్జ్ హబ్ ఏర్పాటు చేయడంలో ప్రపంచ బ్యాంక్ గ్రూప్‌తో భారతదేశం కొనసాగిస్తున్న భాగస్వామ్యాన్ని మంత్రి నిర్మలా సీతారామన్ ప్రస్తావించారు. వ్యవసాయం వంటి రంగాల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకునే అవకాశాలను పరిశీలిస్తున్నామని తెలిపారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ న్యూఢిల్లీలో నిర్వహించిన రెండు రోజుల విభాగాల సదస్సు ముగింపు సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు పాల్గొన్నారు. టీమ్ ఇండియా స్ఫూర్తిని బలోపేతం చేయడం, సహకార సమాఖ్య విధానాన్ని మరింత పటిష్ఠం చేయడం, కేంద్ర, రాష్ట్రాల మధ్య సమన్వయంతో జాతీయ ప్రాధాన్యతలపై సమష్టి బాధ్యతను పెంపొందించడం లక్ష్యంగా ఈ సదస్సుని నిర్వహించారు. ప్రధానమంత్రి ప్రతిపాదించిన విభాగాల సదస్సుల పరంపరలో ఇది మొదటి సదస్సు. కీలకమైన రంగాల ప్రాధాన్యతలపై కేంద్రం, రాష్ట్రాలు కలిసి చర్చించేందుకు, అమలు ప్రక్రియను వేగవంతం చేసి మెరుగైన ఫలితాలను సాధించేందుకు ఈ సదస్సు ఒక సమగ్రమైన వేదికగా పని చేస్తోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వరదలతో తీవ్రంగా ప్రభావితమైన నేపాల్‌కు అందిస్తున్న సహాయక చర్యల్లో భాగంగా భారత్ నుంచి బయలుదేరిన ఐదో విమానం ఈ మధ్యాహ్నం నేపాల్ చేరుకుంది. ఈ విమానంలో ప్రత్యేకమైన సౌరంగాల సహాయక చర్యల పరికరాలతో కూడిన 11 మంది సభ్యుల రెస్క్యూ బృందం, అలాగే 5.5 టన్నుల అత్యవసర ఔషధాలు ఉన్నాయి. నేపాల్‌లో కొనసాగుతున్న సహాయక, రక్షణ చర్యలకు భారత్ అన్ని విధాలా సహాయాన్ని కొనసాగిస్తోందని నేపాల్‌లోని భారత రాయబార కార్యాలయం సామాజిక మాధ్యమం వేదికగా వెల్లడించింది. ఇదిలా ఉండగా నేపాల్‌లో సంభవించిన ఆకస్మిక వరదల కారణంగా మృతుల సంఖ్య 1127 చేరుకోగా.. దాదాపు 4 వేల 900 మంది ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. రెస్క్యూ సిబ్బంది సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉపహిమాలయ పశ్చిమ బెంగాల్, సిక్కింలలో రేపు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) అంచనా వేసింది. దేశంలోని మరికొన్ని ప్రాంతాల్లో కూడా రేపు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, అందులో తూర్పు మధ్యప్రదేశ్‌లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఐఎండీ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, జమ్మూకశ్మీర్, లడఖ్, తెలంగాణ, బీహార్, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్, ఒడిశా, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్, సిక్కిం, పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ వెల్లడించింది. అసోం, మేఘాలయ, బీహార్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్, సిక్కింలో అక్కడక్కడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. మరిన్ని వివరాలను ఐఎండీ శాస్త్రవేత్త ఉమా శంకర్ దాస్ వెల్లడిస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని ప్రతి జిల్లాకు ఉన్న ప్రత్యేక బలాలు, వనరులను వినియోగించుకుని భారత ఎగుమతుల వృద్ధికి దోహదపడేలా కేంద్ర ప్రభుత్వం 'డిస్ట్రిక్ట్స్ యాజ్ ఎక్స్‌పోర్ట్ హబ్స్' (DEH) కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా ప్రతి జిల్లాలోని ఎగుమతి సామర్థ్యాన్ని గుర్తించి.. స్థానిక ఉత్పత్తులు, సేవలకు అంతర్జాతీయ మార్కెట్లను అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఆత్మనిర్భర్ భారత్, వోకల్ ఫర్ లోకల్ అనే విస్తృత లక్ష్యాలకు కూడా ఈ కార్యక్రమం అనుగుణంగా ఉంది. ఈ ఏడాది జనవరి నాటికి దేశవ్యాప్తంగా 770కి పైగా జిల్లాలు DEH కార్యక్రమం పరిధిలోకి వచ్చాయని ఆ మంత్రిత్వ శాఖ తెలిపింది. దీంతో దేశ ఎగుమతుల ప్రణాళికలో జిల్లాల భాగస్వామ్యం మరింత విస్తరించిందని పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ రేపటి నుంచి శనివారం వరకు ఉక్రెయిన్, పోలాండ్ దేశాల్లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆండ్రియ్ సిబిహ్, పోలాండ్ విదేశాంగ మంత్రి రాడోస్లావ్ సికోర్స్కీతో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. భారత్-ఉక్రెయిన్, భారత్-పోలాండ్ ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయడంపై ఈ పర్యటనలో ప్రధానంగా దృష్టి సారించనున్నట్లు విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. అలాగే ప్రాంతీయ పరిణామాలు, ఇరుపక్షాలకు పరస్పర ఆసక్తి ఉన్న అంశాలపై అభిప్రాయాలను పంచుకునేందుకు ఈ పర్యటన అవకాశం కల్పిస్తుందని పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =